www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
అన్నమయ్య



రేపటి నుంచి వ్యవసాయ దక్షిణ మండలి పరిశోధన సమావేశం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

దక్షిణ మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం 2025–26 ఖరీఫ్, రబీ పంట కాలాలకుగాను ఈ నెల 5, 6వ తేదీల్లో మండల పరిధిలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సమావేశానికి వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని జిల్లా వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఐదు జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొని దక్షిణ మండలంలో చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల గురించి చర్చిస్తారు. కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. దక్షిణ మండల పరిశోధన, విస్తరణ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొని 2025–26 సంవత్సరానికి చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళిక మీద సమీక్షిస్తారని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

జిల్లాలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొర్లముదివీడు దళితవాడలో నీటి సమస్యపై ఆ గ్రామ ప్రజలు శనివారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో మంత్రిని కలిసి తమ సమస్యలు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి గొర్లముదివీడులో నూతన బోరు వేసి గ్రామంలో శాశ్వత నీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తెలిపారు. ప్రజలు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఎక్కడైనా నీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రస్తుతం నీటి సమస్య ఉన్న ప్రతి గ్రామంలో నూతన బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.



మంత్రికి తాగునీటి సమస్యను వివరిస్తున్న గొర్లముదివీడు గ్రామస్తులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామాపురం :ప్రజల అభ్యున్నతి కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, మంత్రులు ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలు లేకుండా సంతోషంగా ఉన్నారని రాబోయే రోజులలో ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిశీలించారు.

మహాభారత యజ్ఞంలో పాల్గొన్న మంత్రి

మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామాపురంలో జరుగుతున్న మహాభారతానికి ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని మహాభారతం కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మహిళలు, వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. భక్తులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమేష్ రెడ్డి తమ మనువడు సాకేత్ రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

మండలాల్లో ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహశీల్దార్లతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఆక్రమిత భూములు గుర్తింపు, జీవో ఎంఎస్ నెంబర్ 30 మార్గదర్శకాల మేరకు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణ రెగ్యులరైజేషన్, రీ సర్వే, అందరికీ గృహనిర్మాణం దరఖాస్తుల స్వీకరణ, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు భూముల గుర్తింపు తదితర అంశాలలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు భూములు అవసరం అవుతాయని, మండలంలో ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి తగిన రక్షణ కల్పించాలన్నారు. ఈ అంశంలో మండలాల వారీగా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ పథకం 2025లో భాగంగా ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు 2019 అక్టోబరు 15కు ముందు ప్రభుత్వ భూములను అనధికారికంగా ఆక్రమించుకుని ఏర్పరచుకున్న నివాస గృహాలలో అభ్యంతరకరం లేని వాటి క్రమబద్ధీకరణ అంశంలో గుర్తించిన యూనిట్లు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. హౌసింగ్ రీ వెరిఫికేషన్ పెండింగ్ కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటుకు సాధ్యతలపై కూడా వెంటనే నివేదికను పంపాలని సూచించారు. జిల్లాలో పచ్చి మేత పెంపకానికి డివిజన్, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, డికేటీ, ప్రయివేట్ భూములను ప్రతి మండలంలో కనీసం 3వేల ఎకరాలను గుర్తించాలని, ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. వివిధ పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి, ధోబిఘాట్ల ఏర్పాటుకు అవసరమైన భూముల ప్రతిపాదనలు కూడా వెంటనే సమర్పించాలన్నారు. అదేవిధంగా రీ సర్వే ప్రగతి, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు భూముల గుర్తింపు తదితర అంశాలలో కూడా మండలాల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్‌డిఒ శ్రీనివాస్, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బీమా రంగంలో విదేశీ పెట్టుబడి వద్దు

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో విదేశీ కంపెనీలను అనుమతించవద్దని, ఎల్ఐసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపు ఇచ్చారు. డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం కడప జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఐఆర్‌డిఎ సంస్థ ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తోందని, ఎల్ఐసిని బలహీన పరచే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. అందరికీ పెన్షన్, పెన్షన్ అప్డేషన్, స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కొన్ని అలవెన్సుల విషయంలో తమ పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని వాపోయారు. ఎల్ఐసిలో నూతన రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సాధారణ బీమా సంస్థల్ని విలీనం చేయాలన్నారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టి తక్షణమే తొలగించాలని, ఈ విషయంలో జాప్యాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. కార్మిక చట్టాల నిర్వీర్యం ఆపాలని, 80 శాతం పైన సభ్యత్వమున్న ఎఐఐఇఎకి తక్షణం గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈనెల 20 సమ్మెను బ్యాంకు సిబ్బంది, ఇతర కార్మిక వర్గంతో కలిపి జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డి, నాయకులు అక్బర్ బాష, వై.కల్యాణ్, వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, రత్నకిషోర్, రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

నాడు మట్టి కొట్టి..నేడు సున్నం కొట్టి వెళ్లారు : డిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ పునర్విభన చట్టం 94(3) సెక్షన్ ప్రకారం కేంద్రం విధులు ఏంటో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ ప్రధాని మోదీ మాత్రం ఆంధ్రులను మోసం చేస్తూ అందంగా ఆపద్దాలు చెబుతున్నారని, పదేళ్ల కిందట రాజధానికి వచ్చి మట్టి కొట్టి వెళ్లారని, ఇప్పుడు మళ్లీ అమరావతికి వచ్చి సున్నం కొట్టి వెళుతున్నారని డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ ఆరోపించారు. శనివారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అయినప్పటికీ రాజధాని కోసం రూ.50 వేల కోట్లు అప్పు ఇప్పిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నూతన రాజధానిలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్రాన్నిదే అన్నారు. విభజన చట్టంలో కేంద్రం విధులేంటో స్పష్టంగా పేర్కొంటే మరి ప్రధాని మోదీ మనకు ఇస్తున్నదని ఏమిటని ప్రశ్నించారు. పదేళ్ల కిందట చెప్పిన అబద్దాలే నేడు అందంగా చెప్పి ఘరానా మోసం చేశారని ఆరోపించారు. పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ గురించి పట్టించుకోని ప్రధాని నరేంద్ర మోడీ నేడు మళ్లీ 'అభివృద్ధి చేస్తాం, భుజాలు కలుపుతాం' అంటూ బూటకపు మాటలు చెప్పారన్నారు. 5 కోట్ల మంది ఆంధ్రుల కలల సౌధం అమరావతికి 2015 నుండి అన్ని చేశామని పచ్చి అబద్ధాలు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. కేంద్రం అన్ని ఇచ్చి ఉంటే, ఇంతవరకు రాజధాని నిర్మాణం ఎందుకు కాలేదో కేంద్ర బిజెపి ప్రభుత్వమే చెప్పాలన్నారు. అమరావతి నిర్మాణానికి ఖర్చయ్యే లక్ష కోట్లలో ఒక్క రూపాయి అయినా ప్రకటించారా అని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అని హామీ ఇచ్చారా, కనీసం అమరావతికి చట్టబద్ధత ఇస్తున్నామని చెప్పారా, పోనీ విభజన హామీలపై టైమ్ బాండ్ క్లారిటీ ఇచ్చారా అనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. మోడీని నమ్మి మళ్లీ మళ్లీ మోసపోతున్నట్లు తెలుసుకోవాలని, ఏదో ఉద్ధరిస్తారని, కాసులు కురిపిస్తారని నమ్మి ఒక సారి రాత్రి గోతిలో పడ్డ చంద్రబాబు మళ్లీ మోడీని పిలిచి అదే గోతిలో పగటి పూట పడ్డారన్నారు. రాష్ట్రం ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పు పుట్టనిదే జీతాలకు దిక్కులేదని చెప్పే మీరు రాజధాని నిర్మాణానికి ఎవరిని అడిగి రూ.60 వేల కోట్లు అప్పు తెస్తున్నారో చెప్పాలని, వడ్డీల భారం మోసేదెవరు, రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తి అని వాటిని అమ్మి రాజధాని ఎలా కడతారన్నారు. కేంద్రం మెడలు వంచే దమ్ములేక, భావితరాల మీద అప్పు భారం ఎందుకు మోపుతున్నారో ప్రజలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు ఖదీర్, దర్బార్ బాషా, వైస్ ప్రెసిడెంట్ చెన్నకృష్ణ, పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్, ఖాదర్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాజుల భాస్కర్



ఉద్యోగోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న మేనేజర్ కోటేశ్వరరావు, సిబ్బంది

ఉద్యోగులకు బదిలీ సాధారణమే

ప్రజాశక్తి-మదనపల్లె: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఐడిఐబి బ్యాంక్ మేనేజర్ కోటేశ్వరరావు అన్నారు. శనివారం బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్లుగా పనిచేస్తున్న హేమంత్ కుమార్, శివకృష్ణ మేనేజర్‌గా ఉద్యోగోన్నతులతో బదిలీపై వెళ్తున్న వారిని ప్రత్యేకంగా దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా మేనే జర్ కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ హేమంత్ కుమార్ మేనేజర్‌గా ముంబాయికి, శివకృష్ణ మేనేజర్‌గా పూణేకు వెళుతున్నారన్నారు. ప్రస్తుతం ఇక్కడ నిబద్ధతతో పనిచేసి ఖాతాదారుల మన్ననలు పొందారని పదోన్నతులు పొంది బదిలీపై వెళుతున్న చోటకూడా ఇలాగే మన్ననలు పొందాలని కోరారు. అనంతరం బదిలీపై వెళుతున్న హేమంత్ కుమార్, శివకృష్ణ మాట్లాడుతూ తాము విధినిర్వాహణలో భాగంగా సహచర సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించి ఉంటే క్షయమించాలని కోరారు. విధులలో భాగంగా సిబ్బంది అందరూ సహకరించారని ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ హుస్సేన్ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్ గుండ్లూరి ముజీబ్ హుస్సేన్ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి ఎంతో బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముజీబ్ హుస్సేన్ పార్థివ దేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ ఆయన చాలా ముక్కుసూటి మనిషిగా, నిజాన్ని నిర్భయంగా మాట్లాడే వ్యక్తిగా, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే వ్యక్తిగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడుగా పేరొందినారన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో రెండు సార్లు కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా సేవలు అందించారన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా వున్న సమయంలో పారిశుధ్య సౌకర్యాలు మెరుగు పరచడానికి ఆయన చేపట్టిన గ్యాంగ్ వర్క్ రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు దోహదం చేసిందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో హుస్సేన్ పాత్ర ఎనలేనిదని గుర్తు చేశారు. ఆయన మృతి మదనపల్లె ప్రజలకు తీరని లోటన్నారు. హుస్సేన్ మృతి చాలా బాధాకరమని పలువురు నాయకులు పేర్కొ న్నారు. పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్, టిడిపి యువ నాయకులు జునైద్ అక్బరీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ షమీమ్ అస్లామ్ హుస్సేన్‌కు నివాళులు అర్పించారు.

బెస్తపల్లెలో పిచ్చికుక్క స్వైరవిహారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మండలంలోని బెస్తమల్లెలో శనివారం ఓ పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. కనిపించిన వారినల్లా కరవడంతో గ్రామంలోని పలువురు వృద్ధులు, చిన్న పిల్లలు గాయాలపాలయ్యారు. 15 మందికి పైగా కుక్కకాటుకు గురయ్యారు. పాడి ఆవులపైన సైతం పిచ్చి కుక్క దాడి చేయడంతో ఆవులు కూడా గాయ పడ్డాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఊరిమీద పడ్డ పిచ్చి కుక్కని చంపేందుకు గ్రామస్తులమమతా సన్నద్ధమయ్యేలోపే అక్కడి నుంచి పారిపోయిందని తెలిపారు. గాయపడిన వారు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్సలు చేయించారు. పాడి ఆవులను పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్లు చేయించినట్లు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

అడ్డు గోడలను తొలగించండి సారూ..

- 'చమర్తి'కి డిబిఎన్ పల్లె దళితుల మొర

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దళితులైన తమ అభివృద్ధికి, జాతి ఆత్మగౌరవానికి అడ్డుగా రెండు గ్రామాల చుట్టూ పెత్తందార్లు నిర్మించిన ఎత్తైన అడ్డు గోడలను తొలగించండి సారూ.. అంటూ కూచివారిపల్లె, ఊటుకూరు గ్రామ పంచాయితీలలోని డిబిఎన్ పల్లె ఎగువ, దిగువ దళితవాడ ప్రజలు శనివారం టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు వినతి పత్రం సమర్పించి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఇరు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ డిబిఎన్ పల్లెకు చెందిన నాయుడు సామాజికవర్గం వారు తమ ఇరు గ్రామాల చుట్టూ నాలుగు వైపులా గాలి కూడా సోకకుండా ఎత్తయిన అడ్డుగోడలు నిర్మించారని, దానివల్ల తమకు, తమ ఇళ్ల స్థలాలకు మార్కెట్ విలువ అత్యంత దారుణంగా పడిపోయిందని, కనీసం అత్యవసర పరిస్థితులలో ఇల్లు తాకట్టు పెట్టుకు నేందుకు కూడా తమ ఇళ్ళు కొరగాకుండా పోయాయని ఆవేదన చెందారు. కుల వివక్షతో పెత్తందార్లు నిర్మించిన అడ్డు గోడల వలన తమను మిగతా సమాజం నుంచి వెలివేసినట్లయిందన్నారు. పెత్తందార్లు చట్టంలోని లొసుగులను వినియోగించుకుని వారి పట్టా భూములలో తమను సామాజికంగా వెలువేస్తూ ఎత్తైన అడ్డుగోడలు నిర్మించి తమను ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కుతున్నారని., పౌర హక్కుల ఉల్లంఘనకు మరియు పరోక్ష అంటరానితనానికి పాల్పడిన పెత్తందార్లపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించి వారికి చట్టబద్ధమైన శిక్షలు విధించి దళితులైన తమ అభివృద్ధికి, ఆత్మగౌరవానికి అడ్డుగా ఉన్న అడ్డుగోడలను తొలగించి న్యాయం చేయాలని చమర్తి జగన్మోహన్‌రాజుకు విన్నవించుకున్నారు. జాతి ఆత్మగౌరవం కోసం నినదిస్తున్న తమను వైసిపి సానుభూ తిపరులుగా చిత్రీకరించి పెత్తందార్లు తమను మరింత అణగదొ క్కుతున్నారని, తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని, కలిసివచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని, అవసరమైతే హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని తెలియజేశారు. వారి సమస్యలు సావధానంగా విన్న చమర్తి చట్ట పరిధిలో ఏమాత్రం అవకాశం ఉన్నా వారికి న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిబిఎన్ పల్లె ఎగువ, దిగువ దళితవాడ ఇరు గ్రామాల ప్రజలు సుధాకర్, రెడ్డెమ్మ, చంద్రశేఖర్, సందీప్, రమేష్, రాఘవ పాల్గొన్నారు.



చమర్తి జగన్‌మోహన్‌రాజుకు వినతి పత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

ఘనంగా 'మిట్స్' 27వ వార్షికోత్సవం



ముఖ్య అతిథులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ కళాశాల 27వ వార్షిక దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన జర్పీల్యాబ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ అరిమానిత్యా మాట్లాడుతూ నేటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో టెక్నాలజీ రంగం లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు విద్యార్థుల కెరీర్‌కు ఎంతో ముఖ్యమని, డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు (ఎఐ), ఆటోమేషన్, స్థిరమైన సాంకేతిక పరిష్కారాలు పరిశ్రమలను పునర్నిర్వచిస్తున్నాయని వీటి గురుంచి అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. యువత శక్తి ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన శక్తులలో ఒకటి. నేటి ప్రపంచంలో, మీలాంటి విద్యార్థులు కేవలం అభ్యాసకులు మాత్రమే కాదు–మీరు సృష్టికర్తలు, ఆవిష్కర్తలు తయారీలో నాయకులుగా ఎదగాలన్నారు. మీ ఆలోచనలు భవిష్యత్తును కూడా రూపొందిస్తున్నాయని తెలిపారు. అది సాంకేతిక ఆవిష్కరణ, పరిశోధనా పత్రం, సామాజిక చొరవ లేదా దయగల సాధారణ చర్య ద్వారా అయినా–మీకు అర్థవంతమైన మార్పును సృష్టించే శక్తి ఉంది.కానీ ఈ శక్తికి దిశానిర్దేశం మరియు క్రమశిక్షణ అవసరమన్నారు. కళాశాలలో వెంచర్ స్టూడియోను ఏర్పాటు చేస్తామని, తద్వారా విద్యార్థుల, అధ్యాపకుల ఆలోచనలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయన్నారు. భవిష్యత్తు సాంకేతికంగా మాత్రమే కాకుండా భావోద్వేగపరంగా తెలివైనవారు, నైతికంగా స్థిరపడినవారు, కరుణ, సృజనాత్మకతతో వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నవారిదేనని పేర్కొన్నారు. దీన్నీ ద్వారా విద్యార్థుల, అధ్యాపకుల మైండ్ సెట్ ఇన్నోవేటివ్ ఆలోచనలకు, ఆవిష్కరలకు నాందన్నారు. విద్యార్థులు జీవితాంతం అభ్యాసకులుగా మారాలని, వారి జ్ఞానాన్ని వ్యక్తిగత విజయానికి మాత్రమే కాకుండా సానుకూల సామాజిక ప్రభావాన్ని చూపడానికి ఉపయోగించాలని పేర్కొన్నారు. శ్రేష్టత, ఆవిష్కరణ, సమగ్ర విద్య యొక్క సంస్కృతిని పెంపొందించినందుకు మిట్స్ కళాశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు టెక్నాలజీ పైనే ఆధారపడిఉన్నదని, టెక్నాలజీ లేకపోతే మన మనుగడే కష్టంగా ఉందన్నారు. ఎంతో మంది విద్యార్థులు, అధ్యాపకులు వివిధ టెక్నికల్ కార్యక్రమాలకు విదేశాలకు కూడా కళాశాల నుంచి వెళ్తున్నారన్నారు. కళాశాలలో వెంచర్ స్టూడియోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలశాలలోని విద్యార్థులను వ్యాపారవేతులుగా మార్చడానికి, వారికి ఉన్న నూతన ఆలోచలనలను ఆచరణలో పెట్టుటకు ఇది మంచి అవకాశమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ గత సంవత్సరంలో సంస్థ యొక్క విద్యా విజయాలు, నియామకాలు, పరిశోధన సహకారాలను హైలైట్ చేస్తూ వార్షిక నివేదికను సమర్పించారు. ఆ తరువాత వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థి అవార్డులు, గుర్తింపులు సాయంత్రం ఉత్సాహాన్ని నింపాయి. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారకనాథ్, వైస్ ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నఫీస్‌కు ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

పట్టణానికి చెందిన తారక రామారావు విజ్ఞాన కళాక్షేత్రం అధ్యక్షులు ఎన్టీఆర్ నఫీస్ డాక్టర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం విజయవాడలోని హోటల్ ఐలాపురంలో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ అద్దంకి రాజా ఆధ్వర్యంలో ఈ పురస్కారాల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత ఎన్టీఆర్ నఫీస్ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథం కలిగిన మహనీయుడు ఎన్టీఆర్ అని అభివర్ణించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఐక్యత కోసం ఎంతో కృషిచేశారని, ఆయన అడుగు జాడల్లో తామూ నడుస్తున్నామని చెప్పారు.



ఎన్‌టిఆర్ కీర్తి పురస్కారం అందుకుంటున్న నఫీస్

నిరుత్సాహం

ప్రజాదృష్టి

జిల్లాలో చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాలు నిరుత్సాహాన్ని కలిగించాయి. సిపిడబ్ల్యూ స్కీమ్ టెండర్లు ఓపెన్ చేయడం మొదలుకుని ప్రధానమంత్రి మోడీ అమరావతి పర్యటన సందర్భంగా ఎటువంటి ప్రోత్సహాన్ని కలిగించని వాతావరణం, ఎర్రచందనం స్మగ్లింగ్ ఊపందుకోవడం వంటి పరిణామాలను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని రూ.17.90 కోట్ల విలువ కలిగిన 13 సిపిడబ్ల్యూ స్కీమ్‌ల టెండర్ల ఓపెనింగ్ గోప్యతను పాటించడంపై విమర్శల వర్షం కురుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ మార్గదర్శకాల ప్రకారం టెండరు దక్కించుకున్న గుత్తేదారుల ఏజెన్సీ పేర్లను వెల్లడించకపోవడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. సిపిడబ్ల్యూ స్కీముల కాంట్రాక్టులను సమర్థత కలిగిన వారికి అప్పగిస్తే తాగునీటి సరఫరా వ్యవహారాలను సజావుగా సాగు తాయనడంలో సందేహం లేదు. అధికార పార్టీకి చెందిన కీలక నేతల ఆగడాలకు లోబడితే సాగునీటి సరఫరా వ్యవస్థ నాసిరకంగా సాగు తుందనడంలో సందేహం లేదు. ఫలితంగా నేతల అనుయాయులకు కట్టబెడితే 553 పంచాయతీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయనడం సందేహం లేదు. ఫలితంగా జిల్లాలోని 13.51 లక్షల మంది గొంతు ఎండుతుందనే వాస్తవాన్ని గ్రహించాలి. అమరావతి పున:ప్రారంభానికి విచ్చేసిన ప్రధాని మోదీ రాజధాని అభివృద్ధికి సంబంధించి ఎటువంటి సహాయాన్ని ప్రకటించకపోవడం నిరుత్సాహాన్ని కలిగించింది. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తడం గమనార్హం. భారతీయ సమాజంలో ఏదైనా మంగళకరమైన శుభ కార్యక్రమాలు, ఉత్సవాల్లో పాల్గొనడానికి వెళ్తున్న సందర్భంగా ఫలమో, పత్రమో తీసుకెళ్లడం భారతీయ సంప్రదాయం. ఇటువంటి కనీస సంప్రదాయాన్ని పాటించకపోవడం సంప్రదాయవాదులకు సైతం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల ఎర్రచందనం దుంగలు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మళ్లీ ఎర్రచందనం స్మగ్లింగ్ మాఫియా కార్యకలాపాలు ఊపందుకున్నాయా అనే సందేహం నెలకొంది. స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా ఫారెస్ట్‌శాఖలోని ఖాళీలను భర్తీ చేయడం, గస్తీని ముమ్మరం చేయడం, ఆయుధపరమైన అవసరాలను తీర్చడంపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. కేంద్రం కొప్పర్తి పారిశ్రామికవాడలో భారీ పారిశ్రా మికనోడ్ ఏర్పాటుకు ఆమోదం తెలపడం సంతోషాన్ని కలిగించి ంది. భారీ పారిశ్రామిక నోడ్ ఏర్పాటుకు సంబంధించి నిక్‌డిక్ట్ అనే కేంద్ర సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం శుభసూచ కం. దీంతోపాటు కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి మంజూరు చేయడం, బ్రహ్మంసాగర్ నుంచి రూ.150 కోట్లతో తల పెట్టిన తాగునీటి పైప్‌లైన్ పనుల పూర్తి చేయడం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పూచీ పడినప్పుడే సార్థకత ఏర్పడుతుందని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


ఎగువమాలపల్లిలోని మట్టిరోడ్డు

సిసి రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీ ఎగువ మాలపల్లిలో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ తెలిపారు. ఎగువ మాల పల్లెలో సుమారు 70 కుటుంబాలు నిర్వహిస్తున్నారని, ఇంతవరకు సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. జడ్‌పి హైస్కూల్‌నుంచి ఎగువమాలపల్లి వరకు మెటల్ రోడ్డులో తారు రోడ్డుగా వేయడానికి అప్పటి వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. జెసిపితో ఉన్న రోడ్లు కంకరను లేపేసి మరల పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ఇసి రోడ్లు పనులు మంజూరు చేసి పనులు జరిగే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

మైనార్టీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ భానుమూర్తిరావు తెలిపారు. మైనార్టీ, క్రిస్టియన్ వర్గాలకు సబ్సిడీ రుణాలకు మే 25లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్.వి.బ్రహ్మయ్య తెలిపారు. మైనారిటీలకు రూ. లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్స్‌కు రూ .లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను అందిస్తామని తెలిపారు. ఎంపికైన వారికీ 50 శాతం సబ్సిడీ మంజూరు అవుతుందన్నారు. అర్హత కలిగిన వారు https:// apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకొ నుటకు చివరి తేది 25-05-2025 వరకు ఇతర వివరరాలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయం, కడప 9290448452 , 08562-241137నంబర్లను సంప్రదించాలన్నారు. **వీరబల్లి :** మండలంలోని మైనార్టీలు, క్రిస్టియన్ మైనార్టీలు, సబ్సిడీ రుణాలకు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపినట్లు ఎంపిడిఒ నూర్జహాన్ తెలిపారు. మైనార్టీలకు రూ. లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ. లక్ష నుంచి 5 లక్షల వరకు 50శాతం సబ్సిడీ రుణాలు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయం ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్‌లో..

తంబళ్లపల్లి : మండలంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా లోన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ ఉపేంద్ర రెడ్డి శనివారం తెలిపారు. 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్లలోపు వయసున్న తెల్ల రేషన్ కార్డు కలిగినవారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు మే 10లోపు APOBMMS వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ధ్రువపత్రాలను ఎంపిడిఒ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదేళ్లు నిండిన పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఎంఇఒ నాగేశ్వర నాయక్ తెలిపారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో శనివారం నాగేశ్వర నాయక్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాధ పిల్లలు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఒసి కుటుంబాల గ్రామీణ ప్రాంత పిల్లలు చేరవచ్చన్నారు. సంవత్సర ఆదాయం రూ.లక్ష 20వేలు, పట్టణ ప్రాంతాల వారికి సంవత్సరాదాయం రూ.లక్ష 44వేలు మించరాదన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ కోరారు. విద్యార్థి, తండ్రి ఆధార్ కార్డులు, విద్యార్థి వయస్సు ధ్రువీకరణ పత్రం జత చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతయ్య పాల్గొన్నారు.

మహాభారతంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు: శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు శనివారం మహాభారతంపై స్థానికులు క్రిష్ణారెడ్డి అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి జె.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. ప్రతిరోజు ప్రత్యేక అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపెద్దమ్మతల్లి దేవర

ప్రజాశక్తి - సింహాద్రిపురం : సింహాద్రి పురంలో శ్రీపెద్దమ్మతల్లి దేవరను వైభవంగా నిర్వ హించారు. శనివారం ఉదయం నుంచి దేవర ఉత్స వాలతో ప్రధాన వీధులు రద్దీగా తయారయ్యాయి. ముందుగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వ హించారు. దేవర ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయం విద్యుద్దీపాలతో కొత్త శోభను సంతరించుకుంది. ఎస్పీ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ పర్యవేక్షణలో ముగ్గురు సిఐలు, ఐదుగురు ఎస్‌ఐలు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మండుతున్న ఎండలు

- ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి
- శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ
- పెరిగిన విద్యుత్ వాడకం
- గిర్రున తిరుతున్న మీటర్లు
- విద్యుత్ ఛార్జీల బాదుడుతో జనం బెంబేలు




ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన హైవే రోడ్డు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎండలు మండుతున్నాయి. ఉక్క పోతతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విద్యుత్ బిల్లులు చూసిన సామాన్యుని గుండె గుబెల్ మంటుంది. ఇంతకాలం అదనపు బాదుడైన సర్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్స్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ తదితర పేర్లతో ప్రభుత్వం ఎడాపెడా వసూలు చేస్తోంది. వాటి నుంచి బయటపడక ముందే వినియోగదారుడు ఎండలు, ఒక్క పూత బాదుడు ఎదుర్కొంటున్నాడు. గడిచిన నాలుగు రోజుల నుంచి ఎన్నడూ లేనంతగా రోజువారి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. మండే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యుడి భగభగలు బయటకు రాకుండా చేస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదు. మండల కేంద్రంలో ప్రధాన రహదారులే కాదు వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ వేడిమి నుంచి జనం ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలతో పాటు చల్లటి గాలినిచ్చే విద్యుత్ పరికరాలను ఎక్కువగా వాడుతు న్నారు. రాత్రింబవళ్లు ఎండ వేడి ఒక్క పూతకు తట్టుకోలేక ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లు, ఎసిల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఐదు నిమి షాలు విద్యుత్ పోయినా భరించలేకపో తున్నారు. ఇలా నిరంతరం కరెంటు వాడకం పెరగటంతో విద్యుత్ మీటర్ కూడా గరున తిరుగు తుంది.యూనిట్లు పెరిగి స్లాబ్ మారడంతో వినియోగదారుని గుండె గుబెల్ మంటుంది. దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు ఎండ తీవ్రత ఉక్కపోతకు విలవిలలాడుతున్నారు. ఎసిలో ఉండే సంపన్నులు మినహా పేద, మధ్యతరగతి ప్రజలు అటు బయటకు రాలేక ఇటు ఇళ్లలో ఉండలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీటన్నింటినీ తట్టుకోవడానికి విద్యుత్ పరికరాలను ఆశ్రయిస్తే కరెంటు బిల్లు బాదేస్తుంది. అలా ఇలా కాదు ఏకంగా సాధారణ బిల్లు కంటే రెండింతలు దాటి రావడానికి చూసి సామాన్యుడు భయపడుతున్నారు. చల్లని గాలి నిచ్చే కూలర్, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్ (ఏసి), వాడకమే కాదు వాటి వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్లు ఫ్యాన్లనే ఎంపిక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పట్టణంలో కూలర్లకు డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ను వ్యాపారులు బాగా క్యాష్ కూడా చేసుకుంటున్నారు. కూలర్ కనిష్టంగా 8 వేల నుంచి 18 వేల వరకు అమ్ముతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వీటి ధరలు కొంత పెరిగాయని వినియోగదారులు చెప్తున్నారు. ఇక స్టాండింగ్ ఫ్యాన్ కూడా రూ.2వేలు నుంచి రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. ఎసిల విషయానికొస్తే దాని సామర్థ్యం స్టేజ్ కంపెనీని బట్టి రూ.35 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతున్నాయి. పుష్కలంగా వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు వచ్చేవరకు ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న పెద్దచెరువుకట్ట

- దుర్గంధంతో ప్రజలు తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని పెద్ద చెరువుకట్ట డంపింగ్ యార్డును తలపిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. హోటళ్లు, చికెన్ సెంటర్ల నుంచి వెలువడుతున్న పలు వ్యర్థాలను పెద్ద చెరువు కట్టపై రహదారి వెంబడి వదిలి వెళ్తున్నారు. వాటి నుంచి వస్తున్న దుర్గంధం, దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.గేటు నాలుగురోడ్ల కూడలిలో ఉన్న హోటళ్ళు, చికెన్ సెంటర్లు నుంచి వెలువడుతున్న వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో వాహనాల్లో తెచ్చి రహదారుల పక్కన పాంబోస్తున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసనను వెదజల్లుతున్నాయి. అ రహదారిలో వెళ్లే వాహనదారులు,పాదాచారులు దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఆ దారి వెంట వెళ్లే వారు ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని అంటున్నారు. గతంలో స్థానికులు అనేకమార్లు ఫిర్యాదు చేసిన ప్పటికీ, అధికారులు మాత్రం హెూటళ్లు,చికెన్ సెంటర్ల యజమానులకు తాఖీదులు ఇచ్చి మమ అనిపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికా రులు పారిశుధ్యంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పెద్దచెరువు కట్టపై వేసిన వ్యర్థాలు


మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

అన్నమయ్య ప్రాజెక్ట్ పాపం ఎవరిది? :'చమర్తి'

ప్రజాశక్తి -రాజంపేట అర్బన్

నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీరు అందించే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడం వెనక పాపం ఎవరిదో రాజంపేట ప్రజలందరికీ తెలుసు ఎంపీ మిథున్‌రెడ్డి అంటూ రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తెలియజేశారు. శనివారం రాజంపేట టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషన్ల కక్కుర్తితో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించకుండా డ్యాం నిర్మాణాన్ని తొక్కి పెట్టి ఇప్పుడు టిడిపి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. 2021లో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే 2024 వరకు మూడు సంవత్సరాలు పనులు ప్రారంభించకుండా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి 9 నెలలు అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మీరు మరి డ్యాం కొట్టుకుపోయినందుకు కారణమైన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. వరద బాధితులకు ఏం సహాయం అందించారో తెలపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు డ్యాం లు నిర్మిస్తే, వైసిపి పాలనలో డ్యాం కొట్టుకుపోయేలా చేసి, అధికారం లో ఉన్నన్ని రోజులు ఈ రోజు రేపు అంటూ దొంగ మాటలు చెప్పి నేడు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అయ్యింది ఏమి చేశారని ప్రశ్నించడానికి ఎంఎ కి అర్హత లేదని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి రూరల్ అధ్యక్షుడు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, జంగం శెట్టి సుబ్బయ్య ,క్లస్టర్ ఇన్చార్జులు కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, రాజంపేట కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి పాల్గొన్నారు.

6, 7న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఎంసెట్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 6,7 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఎస్‌విడిసి అటానమస్ డిగ్రీ కళాశాలలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విద్యార్థులచే శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ విద్యావేత్తలచే ప్రశ్నపత్రాన్ని తయారు చేయించామన్నారు. జిల్లాలో ప్రతి ఏడాది ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎంసెట్ కోచింగ్ విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వివరాలకు 82977 62173ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు అభినయ్, ఎంసెట్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ..!

- ఎంపిడిఒకు గ్రామస్తుల వినతి


ఎస్‌సి కాలనీలో తాగునీటి కోసం వేచి చూస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మాండవ్యనది పక్కన ఉన్న పోలుచిన్నారెడ్డి గారిపల్లి ఎస్‌సి, ఎస్‌టి కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో దాదాపు 30 కుటుంబాలు, 200 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామంలోని తాగునీటి పథకాలు పనిచేయక పోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం ఎస్‌సి కాలనీలోని ప్రజలు ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లి ఎంపిడిఒ రాజేంద్రనాథ్ రెడ్డికు నీటి సమస్య తీర్చమని వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంటనే స్పందించి ఆర్డబ్ల్యుఎస్ జెఇ ని పిలిపించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన వారికి తాగునీరు కల్పించాలని ఆదేశించారు. దీంతో గ్రామ ప్రజలు వెనితిరిగి వెళ్లిపోయారు. మంచినీటి సమస్య తీర్చకపోతే ఎంపిడిఒక కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.


తాగునీటి సమస్య గురించి ఎంపిడిఒకు వివరిస్తున్న మహిళలు

కేంద్ర వ్యవసాయ శాఖ సూచనలు అమలు చేస్తాం

-కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి



భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఉద్యాన శాఖకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ చేసిన సూచనలు తప్పకుండా పాటిస్తామని కలికిరి కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. కేంద్ర వ్యవ సాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 2న భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్తలతో జరిపిన సమావేశంలో ఉద్యానవన పంటల నాణ్యమైన ఉత్పత్తి మరియు విలువ జోడింపు పెంచడం చాలా అత్యవసరమని వ్యాఖ్యానించారు. శాస్త్రవేత్తలు కలిసికట్టుగా పని చేసి మన దేశ వ్యవసాయ రంగాన్ని ప్రపంచ దేశాలలో ఉత్తమ స్థాయిలో నిలపాలన్నారు. ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా, ప్రజలందరూ ఉద్యాన పంటల ఉత్పత్తులను వాడటం మునుపటి దశాబ్దాల కంటే ఎక్కు వైందని, అందువల్ల ఈ పంటల ఉత్పత్తి పెరగాలని వీటి విలువ ఆధారిత ఉత్పత్తులు కూడా పెరగాలని సూచించారు. ముఖ్యమైన ఉద్యానవన పంటలైన వివిధ రకాల కూరగాయలు, పండ్లతోటల పెంపకం, సస్యరక్షణ తక్కువ ఖర్చుతో, వాతావరణహిత పద్ధతులతో చేపట్టాలని కోరారు. ప్రభుత్వం కల్పించు వివిధ పథకాల గురించి క్షుణ్ణంగా రైతులకు వివరించాలని ఆయన తెలిపారని అన్నారు. చీడపీడలను తట్టుకునే విత్త నాలను, మొక్కలను వృద్ధిపరచాలని, విషపూరిత పురుగు మందులు వీలైనంతవరకు తగ్గించాలని, సకాలంలో చీడ పీడల నివారణ మార్గాలు రైతులకు అందిం చాలనీ, పరి శోధన ఫలితాలు నేరుగా రైతుకు ఎప్పటికప్పుడు చేర్చాలని కోరారు. ప్రత్యేకమైన పంటలైన కుంకుమ పువ్వు, యాలకులు, తమలపాకులు, మిరియాలు మొదలగు వాటి మీద పరి శోధన లు పెంచాలని శాస్త్రజ్ఞులకు సూచించారు. శాస్త్రవేత్తలు కొత్త వంగ డాల రూపకల్పనతో పాటు కొన్ని మంచి లక్షణాలు కలిగి ఉన్న దేశవాళీ రకాల ను కాపాడుతూ ఉండటం చాలా సంతోషదాయకమని హర్షం వ్యక్తం చేశారు.

రైతు సేవా కేంద్రాలను తొలగింపునకు సన్నాహాలు

ఆందోళనలో ఆరువేల మంది రైతులు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ,ఉద్యానవన రైతులకు వ్యవసాయపరమైన సేవలందిస్తున్న రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న విఎఎ, విహెచ్ఎలను ఇతర శాఖలకు బదలాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహకాలు చేస్తోంది. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఆరు వేలమంది రైతులు వ్యవసా యపరమైన పథకాలు, సబ్సిడీలు, ఇతరత్రా ప్రయోజనాలు కోల్పో తామోనని ఆందోళన చెందతున్నారు. వైసిపి పభుత్వం వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులను ప్రతి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేశారని అన్నారు. వారు సకాలంలో సబ్సిడీ విత్తనాలు,రైతు భరోసా నిధులు, సబ్సిడీ నిధులు సకాలంలో చూసే వారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల సిబ్బందిని భారంగా భావిస్తూ వారిని ఇతర శాఖలకు బదలాయించడం రైతులకు కొత్త సమస్యలను తెచ్చి పెడుతోంది. పట్టణపరిధిలో సుమారు ఆరు వేల మంది మంది రైతులు 4 నుంచి 5 వేల ఎకరాలలో వ్యవసాయం సాగిస్తున్నారు. వీరం దరూ నగర పంచాయతీలోని ఐదు రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసా యపరమైన సేవలు పొందుతు న్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బం దిని బదలాయించడం రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై పునరాలోచించి రైతు సేవ కేంద్రాలను, అందులో పనిచేసే సిబ్బందిని యథావిధిగా కొన సాగించాలని రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నాటుసారా స్వాధీనం : కేసు నమోదు

ప్రజాశక్తి-పీలేరు

నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు పీలేరు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం పీలేరులో జరిపిన దాడుల్లో నాటుసారా కలిగి ఉన్న కె. నిర్మలాబాయి అనే మహిళ నుంచి 10 లీటర్లు, బి.సరోజమ్మ అనే మహిళ నుంచి మరో 5 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు, వీరికి నాటు సారా సరఫరా చేసిన మర్రిమాకులపల్లి తండా, జాండ్ల తండాకు చెందిన ఇరువురు వ్యక్తుల మీద కూడా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.సూర్యనాయక్ తండా పరిధిలో దాడులు నిర్వహించి సాటుసారా తయారీ కోసం సిద్ధం చేసి ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారా, 65 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకుని ఎం. రామదాసు నాయక్, ఎం. ముని శంకరయ్యల మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటు సారా తయారు చేసిన, సరఫరా చేసిన, అమ్మిన, కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవన్నారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం సరఫరా చేసిన వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. నాటు సారాకు సంబంధించిన నేరాలు మానుకోని వ్యక్తులపై పిడి చట్టం ప్రయోగించబడుతుందని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు లక్ష్మి నరసయ్య, గుణ శేఖర్, సిబ్బంది రత్నం, శేఖర్, బాల గురవయ్య, వినోద్, రెడ్డి శేఖర్, చంద్ర, స్వాతి, జబీనా పాల్గొన్నారు.